TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :26 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.20.08.2025 పేజీలు : 8, వెల:రూ.2.00




# బడుగు, బలహీనవర్గాల గొంతుక జస్టిస్ సుదర్శన్‌రెడ్డి




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాజ్యాంగ నిపుణుడు, న్యాయ కోవిదుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతిగా గెలిపించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓబీసీ రిజర్వేషన్ల సాధన స్వతంత్ర కమిటీ చైర్మెన్‌గా బడుగు, బలహీన వర్గాల గొంతుకగా ఆయన పని చేస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తున్న మోడీ ప్రతినిధి సీపీ.రాధాకృష్ణన్ అని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. అందులో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఖర్గే ప్రకటించడం తెలుగు ప్రజల, తెలంగాణ గౌరవ ప్రతిష్టలను మరింత పెంచిందన్నారు. ఏ పార్టీతోనూ సంబం ధంలేని స్వతంత్ర వ్యక్తి సుదర్శన్‌రెడ్డి అని చెప్పారు. ఆయన వ్యవసాయ కుటుంబంలో పుట్టి ఓయూలో విద్యనభ్యసించారనీ, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో జడ్జిగా, చీఫ్ జస్టిస్‌గా, సుప్రీం కోర్టులో జడ్జిగా పనిచేశారని గుర్తుచేశారు. ప్రపంచంతో పోటీపడేలా దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దిన ప్రధాని పీవీ నర్సింహారావు తర్వాత తెలుగువారికి ఇలాంటి అవకాశం రావడం గొప్ప పరిణామం అని చెప్పారు. పీవీకి ప్రధానిగా అవకాశం వచ్చినప్పుడు సిద్ధాంతపరంగా ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ తెలుగువారికి దక్కిన గొప్ప అవకాశంగా భావించి ఆయన గెలుపు కోసం టీడీపీ నుంచి అభ్యర్థిని పెట్టకుండా అప్పటి సీఎం ఎన్.టి.రామారావు తన రాజకీయ విజ్ఞతను ప్రదర్శించారని కొనియాడారు. ఎన్టీఆర్ స్ఫూరితో కేసీఆర్, చంద్రబాబునాయుడు సహకరించాలనీ, మరోమారు బీఆర్ఎస్, టీడీపీ, జనసేన, వైసీపీ, ఎంఐఎం, ఉభయ రాష్ట్రాల్లోని బీజేపీ ఎంపీలు ఆత్మప్రబోధానుసారంగా ఓటేసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రక్షిం చాలంటే రాజ్యాంగ నిపుణుడు, న్యాయ కోవిదుడైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా ఉంటే దేశా నికి ప్రయోజనకరమని నొక్కిచెప్పారు.

రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తున్న, ఎన్నికల్లో నెగ్గేందుకు ఉన్నవారిని చని పోయినట్టుగా, లేని ఓటర్లను ఉన్నట్టుగా చూపుతూ ఈసీ వంటి రాజ్యాంగ వ్యవస్థలను దుర్వి నియోగం చేస్తున్న ఎన్డీయే కూటమి ఒకవైపు ఉండగా.. మహాత్మాగాంధీ స్ఫూర్తితో అంబేద్కర్ అందిం చిన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను రక్షించడం వంటి లక్ష్యంతో ఇండియా బ్లాక్ మరో వైపు ఉందని చెప్పారు. రాజ్యాంగాన్ని రద్దు చేయా లని కుట్రలు చేస్తున్న వారిని ఓడించాలని పిలుపుని చ్చారు. రాజకీయాలకతీతంగా సుదర్శన రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారి పైనా ఉందని నొక్కి చెప్పారు. ఉత్తర, దక్షిణ భారతదేశం అనే తారతమ్యం లేదనీ, ఇండియా బ్లాక్ బెంగాల్, కేరళ, బీహార్, కర్నాటక, యూపీ, ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ ఉందని చెప్పారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఎంపీలు కూడా అండగా ఉండాలని కోరారు. సుదర్శన్‌రెడ్డి గెలిస్తేనే రాజ్యాంగం రక్షించబడుతుందని సీఎం ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

## పీసీ ఘోస్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టులో కేసీఆర్ పిటిషన్



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ పీసీ ఘోస్ కమిషన్ రిపోర్టుపై మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్టే విధించాలని పిటీషన్‌లో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని, కమిషన్ నివేదిక వారికి అనుకూలంగా ఉందని పిటిషన్లో పేర్కొన్నారు. వారి పిటిషన్ బుధవారం విచారకు వచ్చే అవకాశం ఉంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ–దశల లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా ప్రచారం పొందింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అక్రమాలు, నాణ్యతా లోపాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. మెడిగడ్డ బ్యారేజీ వద్ద పియర్లు కుంగిపోవడం, నిర్మాణంలో లోపాలు, డిజైన్ లోపాలను నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ ప్రాజెక్టులో పనిచేసిన అధికారులపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ఈ విషయంపై జస్టిస్ పీసీ ఘోస్ కమిషన్ విచారణ జరిపి..పలు పేజీలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన విషయం తెలిసిందే.

## ఆశారాం బాపూకు బెయిల్ పొడిగింపు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: స్వయంప్రకటిత దేవుడు ఆశారాం బాపూకు మంజూరు చేసిన తాత్కాలిక బెయిల్‌ను గుజరాత్ హైకోర్టు మంగళవారం సెప్టెంబర్ 3 వరకు పొడిగించింది. ఆగస్ట్ 21న ముగియనున్న తాత్కాలిక బెయిల్‌ను సెప్టెంబర్ 3 వరకు పొడిగిస్తూ జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ పి.ఎం.రావల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పునిచ్చింది. ఆ తర్వాత కేసును విచారించనున్నట్లు ప్రకటించింది. మరో అత్యాచార కేసులో ఆశారం దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను రాజస్థాన్ హైకోర్టు ఆగస్ట్ 29న విచారించనుంది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఆశారం అహ్మదాబాద్‌లోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం. 2013 అత్యాచారం కేసులో దోషిగా తేలిన ఆశారాం బాపూకి గాంధీనగర్ కోర్టు జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. వైద్యకారణాలతో ఆగస్ట్ 21 వరకు ఆశారాంకు మధ్యంతర బెయిల్‌ను పొడిగిస్తున్నట్లు గుజరాత్ కోర్టు గతంలో ఆదేశించింది. ఆరోగ్యం క్షీణిస్తున్నందున తాత్కాలిక బెయిల్ కోసం గుజరాత్ హైకోర్టును ఆశ్రయించవచ్చని జులై 30న సుప్రీంకోర్టు ఆదేశించింది.

## క్లిష్ట సమస్యలకు పరిష్కారం చూపేదే ఫొటో




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: క్లిష్టమైన సమస్యలకు కూడా ఫొటోలు పరిష్కారం చూపిస్తాయని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఆ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ కమిషనర్ ప్రియాంక అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ఉత్తమ వార్తా ఛాయాచిత్రాల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పొంగులేటి మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు సంబంధించి క్లిష్టమైన కేసును చేధించడంలో ఒక ఫొటోగ్రాఫర్ తీసిన ఫొటో కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఒక ఫొటోగ్రాఫర్ తీసిన ఫొటో ఆధారంగానే హంతకులను పట్టుకున్నారని వివరించారు. ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికీ, వారిలో ప్రొఫెషనలిజం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫొటో జర్నలిస్టులనేని తెలిపారు. వీటిలో ఫొటోగ్రఫీకి అంతంత ప్రాధాన్యత ఉందని కొనియాడారు.. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ ప్రియాంక మాట్లాడుతూ, కాలం గడచినా, ఫొటోలు మాత్రం చెక్కుచెదరకుండా ఉండి మధుర స్మృతులను గుర్తు చేస్తాయని తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 5 విభాగాలకు నిర్వహించిన ఫొటో కాంపిటీషన్‌లో 94 మంది పాల్గొని 744 ఫొటోలను పంపించారని చెప్పారు. ఫొటోగ్రఫి రంగంలో నిష్టాతులైన వారితో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ విజేతలను ఎంపిక చేసిందని వివరించారు. వివిధ విభాగాల్లో విజేతలైన వారికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఆర్ఓ మల్సూర్‌లతో కలిసి బహుమతితో పాటు నగదు పురస్కారాలను అందజేశారు.

విజేతలు వీరే

రైతుభరోసా విభాగంలో మొదటి బహుమతి సీహెచ్.నరేందర్ (హైదరాబాద్ జిల్లా), ద్వితీయ బహుమతి మహిమాల కైదర్ రెడ్డి (కరీంనగర్), తృతీయ బహుమతి కరింగు శ్రీను (నల్లగొండ) అందుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు విభాగంలో వనం శరత్ బాబు (వరంగల్), రమేశ్ కుడితల (వరంగల్), తడన్ల శ్రవణ్ (ములుగు) వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు తీసుకు న్నారు.

చేయూత విభాగంలో మహిమాల భాస్కర్ రెడ్డికి (సిద్ధిపేట) ప్రథమ బహుమతి, బి.బాబు (సిద్ధిపేట) రెండో బహుమతి, క్రింగు వెంకటేశ్‌కు (నల్లగొండ) మూడో బహుమతి లభించాయి. రాజీవ్ యువ వికాసం క్యాటగిరీలో మదురి బ్రహ్మాచారి (సూర్యాపేట), కంది శివ ప్రసాద్ (ఖమ్మం), ఎరుకుల్ల వీరేశం (పెద్దపల్లి) మొదటి, రెండో, మూడో బహుమతులను కైవసం చేసుకున్నారు.

జనరల్ (బెస్ట్ ఫోటోగ్రఫిక్ పిక్) విభాగంలో ఆర్.హరిప్రేమ్‌కు ప్రథమ బహుమతి రాగా, నవతెలంగాణ దినపత్రిక సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కె.నరహరికి ద్వితీయ బహుమతి, పి.సంపత్ కుమార్ చారి (రంగారెడ్డి జిల్లా)కు తృతీయ పురస్కారాన్ని మంత్రి అందజేశారు. ఇవే కాకుండా ప్రతి విభాగంలో మరో ఐదు ఫొటోల చొప్పున 25 మందికి కన్సోలేషన్ పురస్కారాలను అందజేశారు.

## ప్రభుత్వోద్యోగుల జంగ్‌సైరన్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ జంగ్‌సైరన్ మోగించింది. దానిలో భాగంగా అక్టోబర్ 12న లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. వచ్చేనెల ఎనిమిది నుంచి 18 వరకు జిల్లాస్థాయి చైతన్య సదస్సులు నిర్వహించి ఉద్యోగులను సమాయత్తం చేసేందుకు బస్సుయాత్ర చేపడతామని ప్రకటించింది. తమ డిమాండ్ల సాధన కోసం 20 నెలలు ఎదురుచూశామనీ, ఇక ఓపిక పట్టే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం తప్ప తమముందు మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

కొందరు మంత్రులు మమ్మల్ని గుర్తుపట్టడం లేదు : జగదీశ్వర్

ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్తున్నదని ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్ అన్నారు. జీతభత్యాలు సకాలంలో చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల బిల్లులను చెల్లిస్తామంటూ మంత్రివర్గం ఆమోదించిందని గుర్తు చేశారు. నెలకు రూ.700 చెల్లిస్తామన్నారనీ, మూడు నెలల్లో రూ.2,100 కోట్లు ఎక్కడ చెల్లించారంటూ ప్రశ్నించారు. పీఆర్సీ గడువు ముగిసి రెండేండ్లు అవుతున్నదనీ, నివేదిక సిద్ధంగా ఉన్నా తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు డీఏల కోసం సమ్మె నోటీసు ఇచ్చిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. తాము దాచుకున్న సొమ్మును కూడా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికే 200 నెలలు ఆగామనీ, ఇంకెన్ని రోజులు ఆగాలని అడిగారు. ఉద్యోగులు నిరాశా, నిస్పృహల్లో ఉన్నారని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇవ్వడం లేదని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో అవమానాలను భరిస్తున్నామని అన్నారు. కొందరు మంత్రులు ఉద్యోగ సంఘాల నేతలను గుర్తు పట్టడం లేదన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదనీ, ఏ రాజకీయ పార్టీకి అనుకూలం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వమేదైనా ఉద్యోగులకు ఇబ్బందులకు గురిచేస్తున్నదని వివరించారు. ఆరోగ్య కార్డులను ఇవ్వాలని కోరారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. వివిధ కారణాలతో ఉద్యోగులను కలెక్టర్లు సస్పెండ్ చేస్తున్నారని అన్నారు. వారికి రావాల్సిన బిల్లులు, ఇతర సౌకర్యాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను బలహీనవర్గాల ప్రజలకే అమలు చేయాలని చెప్పారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల గురించి సీఎం, డిప్యూటీ సీఎం తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గన్‌మెన్, పీఏలను అడిగినా ఉద్యోగుల పరిస్థితి తెలుస్తుందన్నారు. ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకే అక్టోబర్ 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో ఎల్బీ స్టేడియం లేదా సరూర్‌నగర్ స్టేడియంలో భారీ సభను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే అక్కడే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం : శ్రీనివాసరావు

సెప్టెంబర్ ఒకటో తేదీన పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాన్ని చేపడతామని ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు. హైదరాబాద్ లలిత కళాతోరణంలో ఐదారు వేల మంది ఉద్యోగులతో నిరసన తెలుపుతామని అన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు శాపంగా మారిందని చెప్పారు.

## భారీ వర్షాలు.. స్కూళ్లు, కాలేజీలు బంద్

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ముంబై నగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో మహానగరం స్తంభించిపోయింది. అనేక ప్రాంతాలు నీట మునిగి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నేడు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అప్రమత్తమైంది. నగరంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు మంగళవారం సెలవు ప్రకటించింది. నిన్న కురిసిన వర్షాలకు ముంబైలోని పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల చెట్లు కూలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానాశ్రయానికి వెళ్లే దారుల్లో నీరు చేరడంతో, ప్రయాణికులు ముందుగానే బయలుదేరాలని ఇండిగో ఎయిర్‌లైన్స్ సూచించింది.

# సూర్య నమస్కారాల వీరుడికి ఘన సన్మానం




మెట్ పల్లి అమృత్ తెలంగాణ ఆగస్టు 19 ప్రపంచంలోనే అతి ఎత్తైన పర్వతాలపై సూర్య నమస్కారాలు చేస్తూ భారతదేశ కీర్తి పతాకాన్ని విశ్వ వ్యాప్తం చేస్తున్న మరిపెల్లి ప్రవీణ్ ను మంగళవారం ఆయన స్వగ్రామమైన వెల్లులలో ఆయన సొంత ఖర్చులతో నెలకొల్పిన ప్రయాగ్ ఇల్లు కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గీతా కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతంలో జన్మించిన ప్రవీణ్ యోగ విద్యలో ప్రావీణ్యం సాధించి ఎత్తైన పర్వతాలపై 108 సూర్య నమస్కారాలు చేస్తూ ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సాధించారని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఆయన చేస్తున్న సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లపల్లి రామాగౌడ్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ గౌడ్, కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు ఏపూరి శ్రీనివాస్ గౌడ్ నాయకులు డాక్టర్ చేపూరి కాషా గౌడ్, జుంగుల మారుతి గౌడ్, కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర వరదల్లో జగిత్యాల వాసుల గల్లంతు

## కారుతోసహా కొట్టుకు పోయిన ముగ్గురు మహిళలు మరో యువకుడు, డ్రైవర్ సేఫ్



వరదలో గల్లంతైన మహిళలు

జగిత్యాల రూరల్ అమృత్ తెలంగాణ ఆగస్టు 19 జగిత్యాల జిల్లా వాసులు బంధువుల పెండ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా మహారాష్ట్ర వరదల్లో ముగ్గురు మహిళలు గల్లంతయ్యారు. భారీ వరదలకు కారుతో సహ కొట్టుకుపోగా, డ్రైవర్‌తోపాటు మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తారకరామనగర్‌లో ఉండే ఆఫ్రీన్, సమీనా, హసీనా, సమీనా మేనల్లుడు షోయబ్ కలిసి ఆదివారం ఉదయం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముక్కేడ్ తాలూకా ఉద్గిర్ ప్రాంతంలోని బంధువుల ఇంట్లో పెండ్లికి బస్సులో వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు కారు కిరాయికి మాట్లాడుకొని రాత్రి సమయంలో బయలుదేరారు. గడిచిన మూడు రోజుల నుంచి ఆ ప్రాంతంలో పడుతున్న భారీ వర్షాలకు రోడ్లపై వరద ఉప్పొంగుతుండగా, నాందేడ్ జిల్లా దెగ్లూర్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో కారు వరదల్లో చిక్కుకున్నది. నాలుగు వైపులా వరద ఉధృతంగా రావడంతో కారు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో షోయబ్‌తోపాటు డ్రైవర్ చాకచాక్యంగా బయట పడగా, ముగ్గురు మహిళలు కారుతోసహా కొట్టుకుపోయారు. ప్రమాదం నుంచి బయటపడిన షోయబ్ ఇచ్చిన సమాచారం మేరకు జగిత్యాలలోని కుటుంబసభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు.

**వరదలో చిక్కుకున్నాం.. పిల్లలు జాగ్రత్త**

ప్రమాదంలో చిక్కుకున్న ఆఫ్రీన్ తన భర్త అబ్దుల్‌పాషాకు ఫోన్ చేసింది. 'మేం వరదలో చిక్కుకున్నం. కారులోకి వరద వచ్చింది. మమ్మల్ని ఎవరైనా కాపాడితే బతుకుతం. లేకపోతే మేం బతికే పరిస్థితిలో లేం. పిల్లలు జాగ్రత్త' అంటూ రోదించింది. కాసేపటికే ఫోన్ స్విచ్చాఫ్ అయింది. బంధువులు ఫోన్ చేస్తే ఆఫ్రీన్ ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో ఆందోళన చెందారు. రాత్రికి రాత్రే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో గల్లంతైన మహిళల కోసం వెతికారు. సాయంత్రానికి గల్లంతైన ప్రదేశానికి కొద్ది దూరంలో కారు కనిపించింది. కానీ, మహిళల ఆచూకీ దొరకలేదు.

# తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు బంద్




ములుగు అమృత్ తెలంగాణ ఆగస్టు 19 : గోదావరి నదికి వరద భారీగా ఉధృతి పెరిగింది. ములుగు జిల్లాలో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోని వాజేడు మండలంలోని పేరూరు దగ్గర వరద స్థాయి 15.83 మీటర్లకు చేరగా మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసారు అధికారులు. టేకులగూడెం వద్ద 163 జాతీయ రహదారిపై వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. రెగుమాగు వాగు వద్ద టేకులగూడెం బస్సు స్టాండ్ సమీపంలోని లో-లెవెల్ బ్రిడ్జి నీట మునిగింది. దీంతో ములుగు ఎస్పీ డాక్టర్ పి. షబరీష్ ఆ బ్రిడ్జిని మూసివేయాలని ఆదేశించారు. భద్రత కోసం బారికేడ్లు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. గత నాలుగు రోజుల నుంచి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లోని గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో నదిలో భారీగా వరద నీరు చేరుతోంది. మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 32.8 అడుగులకు చేరింది.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత,కు సన్మానం.....

## ప్రజలను విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమాలతో ఇంకా ఎన్నో అవార్డులను పొందాలని ఎమ్మెల్యే రామారావు పటేల్, శాలువాతో సన్మానించి అభినందించారు.....




డాక్టర్ సఫా పండరిని సన్మానించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా బైంసా ఆగస్టు 19 అమృత్ తెలంగాణ బైంసా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ 79 వ స్వాతంత్ర సంబరాల సందర్భంగా మన కుబీర్ గ్రామానికి చెందిన డాక్టర్ సావ పండరి, సామాన్యులకు చేస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి, మత్తుకు యువత చిత్తు కాకూడదు అంటూ యువతకు అవగాహన సదస్సులను నిర్వహించడం గుర్తించి, పలు అంశాలపై ప్రభుత్వ అధికారులకు ప్రశ్నించి సమాధానం రాబట్టిన ఎస్ జె డబ్ల్యూ హెచ్ ఆర్ సి రాష్ట్ర ప్రతినిధి ,కి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రముఖులు అందించడం ఎంతో హర్షించదగ్గ విషయమని, అదే విధంగా మును ముందు కూడా నిరుపేదలకు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు మీ సేవలు చాలా అవసరమని, మానవసేవయే మాధవసేవగా ముందుకు వెళ్తూ యువతకు మార్గదర్శకంగా, నిరుపేదలకు అండగా మరెన్నో సామాజిక కార్యక్రమాలు చేయాలని తెలియజేశారు

# శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల.. పెచ్చులూడుతున్న పైకప్పులు

జుక్కల్ : అమృత్ తెలంగాణ: మండలంలోని బిజ్జల్ వాడి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరింది. గత 15 16 ఏళ్లుగా ఈ శిథిలమైన పాఠశాలలోని విద్యను కొనసాగిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు రావాలంటే జంకుతున్నారు. వర్షాకాలం ఉన్నందున పైకప్పు నుండి నీరు పాఠశాలో లోపలి భాగంలో కారుతోంది. పెచ్చులు ఊడి పెల్లలు క్రిందకు పడిపోతున్నాయి. గోడలన్నిటికీ చీలికలు వచ్చి సందులు ఏర్పడ్డాయి. పాఠశాల ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు క్షణం క్షణం భయంతో జంకుతున్నారు. పాఠశాలకు విద్యార్థులు రావడం లేదని, వారి ఇండ్లకు పోయి తల్లిదండ్రులకు ఎంత అవగాహన పరిచినా పాఠశాలకు రావడం లేదు. విద్యార్థులను పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులే సుముఖంగా లేరు. భయం నీడలో పాఠశాల కొనసాగుతుందని, అందుకే పాఠశాలకు పంపాలంటే భరోస లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. శిథిలమైన పాఠశాలకు రాకుండా తల్లిదండ్రులే పంపడం లేదని, పాఠశాల కూలిపోయి ప్రమాదం జరిగి ఏదైనా సమస్య తలెత్తితే ఎవరు బాధ్యులుగా ఉంటారని తిరగు ప్రశ్నలు అడుగుతున్నారని హెచ్‌ఎం ఉపాధ్యాయుడు ఇషాంత్ వార్ రవి కుమార్ అన్నారు. ఈ పాఠశాలలో మొత్తం 30 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతము పాఠశాలకు ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు తప్ప మిగతా విద్యార్థులు పాఠశాలకు రావడం లేదని తెలిసింది.

# భారీ వర్షాలు- వరదలు- నష్టం- సహాయక చర్యలపై మంత్రి జూపల్లి సమీక్ష



సమీక్షలు పాల్గొన్న జిల్లా అధికారులు




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు



భారీ వర్షంతో పత్తి పంట నష్టపోయిన చెట్టును మంత్రికి చూపెడుతున్న అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్





ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామం త్రివేణి చెరువు భారీ వర్షాలకు దెబ్బతిన్న సందర్భంగా మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు పరిశీలించారు.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి భారీ వర్షాలు, వరదల కారణంగా వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలపై పెన్ గంగా గెస్ట్ హౌజ్ లో మంత్రి జూపల్లి జిల్లా స్థాయి సమీక్షించారు. చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులకు తగిన సూచనలు చేస్తూ, వరద నష్టంపై శాఖల వారీగా సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆ నివేదికను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆ మేరకు నిధులు కేటాయించాలని కోరతానని తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటలు, కాల్వలకు గండ్లు పడ్డ చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని, విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాజర్షిషా ఎస్పీ అఖిల్ మహాజన ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, , ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అంకోలి లో పర్యటించి తంతోలి వాగును, వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో (బుధవారం) విద్యాసంస్థలకు సెలవు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రేపు (బుధవారం) నిర్మల్ జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యార్థుల రవాణా, ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు జలమయం కావడం, చెరువులు, ప్రాజెక్టులు నిండిపోవడం, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయాణించడం కష్టసాధ్యమని పేర్కొన్నారు. రేపు (ఆగస్టు 20) జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఒకరోజు సెలవు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 9100577132లో సంప్రదించవచ్చని తెలిపారు.

# సోపూర్ లో కొనసాగుతున్న పశువుల మరణాలు..

జుక్కల్ :అమృత్ తెలంగాణ: మండలంలోని కర్ణాటక , మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన సోపూర్ లో పశువుల మరణాలు ప్రస్తుతం ఇంకా కొనసాగుతున్నాయి అని పాడి రైతులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలోని జాన్సన్ అనే పాడి రైతు మూడూ - నాలుగు ఏండ్ల వయస్సు ఉన్న కోడె సుమారు రూ. 60 వేల విలువైనది రాత్రి మృత్యువాత పడిందన తెలిపారు. వర్షాకాలం ఉన్నందున భారీ వర్షాలు పడుతూ ఉండడంతో గ్రామానికి వెళ్లడానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నది. కానీ పశు వైద్య బృందం మాత్రం సోమవారం ఇద్దరు కాంపౌండర్లు, గోపాల మిత్రులు వచ్చి కొన్ని పశువులకు వైద్యం చేసి వెళ్లిపోయారని తెలిసింది. పాడి రైతులు వద్ద ఉన్న పశు సంపద రోజురోజుకు ఒక్కొక్కటి చొప్పున మరణిస్తున్నయని అన్నారు. రాబోయే తరాలకు పశువుల సంపద తరిగిపోతోందని, ఆర్థికంగా తాము నష్టపోతున్నామని పాడి రైతులు ఆవేదన చెందారు. గ్రామంలో పశువుల మరణాలు సంభవిస్తున్న సమయంలో అధికారులు, సంచార పశు వైద్య వాహనాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, మండల కేంద్రంలోని వైద్యులు పట్టించుకోవాల్సిన అవసరం ప్రస్తుతం ఆసన్నమైంది. అయినా నిర్లక్ష్యంగా ఉంటూ పట్టించుకోకపోవడం వలన పశు మరణాలు సంభవిస్తున్నాయి అని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, వెంటనే గ్రామంలో పశువులకు వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామ పాడి రైతులు కోరుతున్నారు.

# కుప్టి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు ధైర్యం కల్పించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఆడే గజేందర్



మీడియాతో మాట్లాడుతున్న ఆడే గజేందర్



పత్తి పంటను పరిశీలిస్తున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : నష్టపోయిన రైతుల వివరాలు, దెబ్బతిన్న ఇళ్ళ వివరాలు పక్కగా నమోదు చేయలని అధికారులకు సూచించిన -ఆడే గజేందర్.... అదనపు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే విధంగా చూస్తా నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామంలో పర్యటించి భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలపొలాలు, దెబ్బతిన్న ఇళ్ళను పరిశీలించి, బాధితులను ధైర్యం కల్పించి , ప్రభుత్వం నుంచి ఆదుకుంటాం అని భరోసా కల్పించి అధికారులతో మాట్లాడి నష్టపోయిన రైతుల వివరాలు మరియు దెబ్బతిన్న ఇళ్ల వివరాలు పక్కగా నమోదు చేయాలని సూచించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఆడే గజేందర్ అయన వెంట బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, నాయకులు నాయిడి రవి,నారాయణ, షేక్ అలి, యండి సద్దాం, జాదవ్ కపిల్, పాల శంకర్, ఇషక్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు



చెక్కును అందజేస్తున్న జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పక్కన ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలం, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శ్రీ లాండే దత్తు, స/0 లక్ష్మణ్ గారు, 27.05.2025న భోరాజ్ మండలంలోని తరోడా వంతెనను దాటడానికి ప్రయత్నిస్తుండగా, అనుకోకుండా వచ్చిన తీవ్రమైన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటనపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సవివరంగా పరిశీలించి, రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నుండి బాధితుడి భార్య శ్రీమతి ఎల్. జ్యోతి గారికి రూ.5,00,000/ – (ఐదు లక్షల రూపాయలు)

ఆర్థిక సహాయంగా మంజూరు చేసిన చెక్కును ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ ఆర్థిక సహాయం వారి జీవితంలో కొంత ఉపశమనాన్ని కలిగించాలని ఆకాంక్షించారు

# విద్యాశాఖ తెలంగాణ సమగ్ర శిక్షహైదరాబాద్ ,%ూూ×వీజూ% ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని TTD కల్యాణ మండపం లో దివ్యాంగుల కొరకు ప్రత్యేకంగా ఉపకరణాలు అందజేయుటకు గాను గుర్తింపు, నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని పలు కౌంటర్లను పరిశీలించారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఈ సందర్భంగా కలెక్టర్ 4విద్యాశాఖ తెలంగాణ సమగ్ర శిక్ష హైదరాబాద్ అలిమ్ కో ALIMCO ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ పరిధిలోని TTD కల్యాణ మండపం లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇదే కార్యక్రమం రేపు బుదవారం ఉట్నూరు డివిజన్లో కొమరం భీం కాంప్లెక్స్ వికాసం పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల కొరకు ప్రత్యేకంగా ఉపకరణాలు అందజేయుటకు గాను గుర్తింపు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయనైనదనీ ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగులను పరీక్షించి ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులను గుర్తించి వారికి ఉచితంగా ఉప కారణాలను అందజేయడానికి సిఫారసు చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా పలు కౌంటర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, HI, MR, తదితర కౌంటర్లను సందర్శించి నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి హాజరయ్యే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈ శిబిరానికి ధ్రువపత్రాలు

1. ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ
2. UDID సర్టిఫికెట్ /సదరం సర్టిఫికెట్ (వైకల్యం 40% కన్నా ఎక్కువగా ఉండాలి )
3. ఆదాయ ధ్రువీకరణ పత్రము /రేషన్ కార్డు జిరాక్స్ కాపీ
4. రెండు పాస్ ఫోటో సైజ్ ఫోటోలు (వైకల్యం ఫోటోలో కనిపించే విధంగా ఉండాలి )
5. 0– 18 సంవత్సరముల వయసుగల దివ్యాంగులు అర్హులు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్ష ప్రభావిత ప్రాంతాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరయిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్




సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ దేగామ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇండ్లు మంజూరు చేయాలి ఇచ్చొడ ఆశ్రమ పాఠశాలకు శాశ్వత గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయా జిల్లా ఇంచార్జ్ మంత్రిని కోరిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ గత మూడు రోజుల నుంచి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు బోథ్ నియోజకవర్గంలోని 10 మండలాల్లో 20 వేల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ గారు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పెన్ గంగా భవన్ లో ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ బోథ్ ఎస్టీ నియోజకవర్గంలో అనేకమైన బీద కుటుంబాలు కేవలం పంటపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తారని అలాంటి వారికి ఈ భారీ వర్షాల పట్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవ్వడం బాధాకరమని కేవలం బోథ్ నియోజకవర్గంలోనే 20 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని కావున వారందరికీ సర్వే త్వరగా పూర్తి చేసి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. అదేవిధంగా బజార్ హత్నూర్ మండలంలోని దేగామ ప్రాజెక్టు నిర్వాసితులకు తీవ్ర నష్టం కలిగిందని వారికి పక్క ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఇచ్చొడ ఆశ్రమ పాఠశాలలో భారీ వరద చేరి విద్యార్థినీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు దానికి పక్క కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన బోథ్ శాసనసభ్యులు అనిల్ జాధవ్



చెక్కును అందజేస్తున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బోథ్ మండల కేంద్రానికి చెందిన మెడిచేల్మా గంగ లక్ష్మీ రూ. 60,000/- మరియు ఇచ్చొడ మండలంలోని జల్ద గ్రామానికి చెందిన ముస్లే అరుణ మంజూరు అయిన

రూ. 39,000/- మరియు కామగిరి గ్రామానికి చెందిన మారొతి కనక రూ. 17,500/- మరియు నెరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మాడెపు రాధ మంజూరు అయిన రూ. 27,000/- ల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, ప్రవీణ్, నంద కిషోర్, ఫయాజ్, పోతారెడ్డి గార్లతో పాటు తదితరులు ఉన్నారు

# ఫోటో ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పురస్కరించుకొని ఆదిలాబాద్‌లో జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఫోటోగ్రాఫర్ సృష్టికర్త లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఉత్తమ ఫోటోగ్రాఫర్లకు బహుమతులు అందజేశారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఫోటోగ్రాఫర్లు తీసే చిత్రాలు పదిలంగా నిలిచిపోతాయని, ఎప్పటికీ గుర్తుండిపోయేలా, అందంగా కనిపించేలా వీడియోలు తీయడం వారికే సాధ్యమని అన్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.. కార్యక్రమంలో ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్, విజయ్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ అశోక్, హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా గౌరవ సలహాదారులు అనిల్ దేశ్పాండే, గౌరవ అధ్యక్షుడు మురళిధర్, కోశాధికారి సంతోష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి. - తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి జూపల్లి ఆదేశాలు.




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశానికి హాజరైన జిల్లా ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు



భారీ వర్షం రీత్యా ఫోటో మంత్రికి చూపెడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో కురుస్తున్న నిరంతర భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షపాతం కారణంగా కడెం, స్వర్ణ, గడ్డన్న వాగు ప్రాజెక్టుల నుండి నీటిని దిగువకు విడుదల చేయడం జరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలను ముందుగానే సమాచారం ఇచ్చి రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని గ్రామాల వారీగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, నివాస గృహాలు దెబ్బతిన్న నేపథ్యంలో సంబంధిత శాఖలు తక్షణమే సర్వే చేసి నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనల మరమ్మత్తులను నాణ్యతతో పునర్నిర్మించేలా అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే వరదల కారణంగా నీట మునిగిన వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలను తక్షణమే సర్వే చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య శాఖ అధికారులు తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఫీవర్ సర్వే చేపట్టి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టంచేశారు అంతకుముందు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మండలాల వారీగా, శాఖల వారీగా భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఫోటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండె విట్టల్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాగతం పలికిన ఆత్రం సుగుణక్క, బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పక్కన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



జిల్లా ఇన్చార్జ్ మంత్రితో కాలీ నడక నడుస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అధిక వర్షం కురుస్తున్న అతిభారీ వర్షాలకు గురైన వరద ముప్పు ప్రాంతాలను సందర్శించడానికి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసినటువంటి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు మావల బైపాస్ వద్ద ఘన స్వాగతం పలికిన టీపీసీసీ ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణక్క , తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సందర్భంగా భారీ వర్షాలతో ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన నష్టాల గురించి మంత్రి వివరించడం జరిగింది. పలు కాలనీల్లో వరదనీరు ఇళ్లల్లో చేరి ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, అటు రైతులు చేలల్లోకి వరదనీరు చేరి పంటలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, సీనియర్ నాయకులు రేండ్ల రాజన్న, అఫ్సర్ ఖాన్ , అలీం ఖాన్, సమీ ఉల్లా ఖాన్, సంతోష్, గోవింద్, అక్షయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తం - కడెం ప్రాజెక్టు ను పరిశీలించిన మంత్రి జూపల్లి



కడెం ప్రాజెక్టును సందర్శించిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు



కడెం ప్రాజెక్టు గురించి మంత్రికి తెలియజేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ఇన్ఫ్లో, అవుట్ఫ్లోపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే 9 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులు పూర్తిచేశామని వెల్లడించారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వరదల కారణంగా పంట పొలాలు, నివాస గృహాలు, రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని, అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు. కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సమాచారం అందించాలని, అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాగులు, నదులు, ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఎమ్మెల్సీ దండేవిట్టల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కు షాక్

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గుడిహత్నూర్ మండలంలోని మాచాపూర్, కొలంగూడా గ్రామానికి చెందిన దాదాపు 30 మంది ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు నేరడిగొండ పట్టణ కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గుడిహత్నూర్ మండలంలోని మచపూర్, కొలంగూడా గ్రామానికి చెందిన దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా పార్టీ లో చేరిన వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే , ఆడే గజేందర్ తోనే సాధ్యమని వారి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంగ్శేమ పథకాలు పేదవారికి చేరుతున్నాయి అని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు...

చేరిన వారిలో జైవంత్ రావు, లేద్దిరాం, సీతారాం, ఆనంద్ రావు , అయు పటేల్, రాజ్ కుమార్, భీమ్రావు, జంగు సురేష్ దాదాపు 35 మంది చేరారులి ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి రేవంతన్న నాయకత్వంలో పనిచేయాలని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేయడమే లక్ష్యంగా ముందు కెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడే వసంతరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాథోడ్ రమేష్ రాథోడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# పొంగి పొర్లుతున్న ఎగువ మానేరు

రాజన్న సిరిసిల్ల అమృత్ తెలంగాణ: కామారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గంభీరావుపేట మండలంలోని నర్మల ఎగువ మానేరు డ్యామ్ పొంగిపొర్లుతోంది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పాల్వంచ వాగు ఉప్పొంగి డ్యామ్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.మంగళవారం ఉదయం నుంచి డ్యామ్ మత్తళ్లు దూకుతూ జలపాతంలా అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరించింది. డ్యామ్ పూర్తి నీటిమట్టం 32 అడుగులకు చేరగా, రెండు టీఎంసీల నీటి నిల్వతో నిండిపోయింది. ప్రస్తుతం రెండు మత్తళ్ల నుంచి నీరు పాలధారలా దిగువనున్న మధ్య మానేరు జలాశయానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. జలపాతం అందాలను చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎస్పై రమాకాంత్ అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మత్తడి ప్రాంతానికి ఎవరూ రాకుండా రోడ్డుకు ఇరువైపులా భారికేడ్లు ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేశారు.వరద ఉధృతి నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.



ఎగువ మానేరు నుంచి మధ్య మానేరుకు భారీగా వరద నీరు విడుదల అవుతున్నందున, దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గస్వాగతం పలికిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గస్వాగతం పలికిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కు నష్టపోయిన పంటలను, ఇళ్లను పరిశీలించడానికి వచ్చిన మంత్రి .కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి స్వాగతం పలికారు బోథ్ నియోజకవర్గంలో తాజా పరిస్థితులపై జిల్లా ఇన్చార్జి మంత్రి నియోజకవర్గ లో



మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాగతం పలుకుతున్న ఆడే గజేందర్

జరికిన నష్టాన్ని లిఖితపూర్వకంగా తెలిపిన. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

# బాలీవుడ్ లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక



సినిమా తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్దాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది.

# ‘సింగిల్స్’తో హాట్ లేడీ ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా?

డబుస్మాష్ వీడియోలతో నెట్టింట పాపులర్ అయిన ఢిల్లీ భామ కేతికశర్మ. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌గా మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కేతిక వెర్సటైల్ డైరెక్టర్ పూరి దృష్టిని ఆకర్షించి తొలి అవకాశాన్ని దక్కించుకుంది. పూరి తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. కానీ తొలి మూవీతో హాట్ బేబీగా గుర్తింపుని తెచ్చుకుందే కానీ హిట్‌ని మాత్రం దక్కించుకోలేకపోయింది. హాటీగా పూర్తి ఎఫర్ట్ పెట్టినా కథ, కథనాలు ఆకట్టుకోలేకపోవడంతో కేతికకు తొలి అడుగులోనే పరాభవం ఎదురైంది. ఆ తరువాత నాగశౌర్యతో చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగ కూడా అదే కోలలో చేరి కేతికని తవ్రంగా నిరాశకు గురి చేసింది. పవర్‌స్టార్‌తో కలిసి సాయిధరమ్ తేజ్ చేసినబ్రో కూడా కేతిక కెరీర్‌ని ట్రాక్‌లో పెట్టలేకపోయింది. అయితే ఇటీవల నితిన్ నటించిన రాబిన్ హుడ్ లో అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటమ్ నంబర్‌లో హీటెక్కించింది. శేఖర్ మాస్టర్ వివాదాస్పద స్టెప్పులతో వార్తల్లో నిలిచింది. సినిమా హిట్ కాకపోయినా కేతికని మాత్రం వార్తల్లో నిలిపేలా చేసింది. అయితే కేతిక ఐటమ్ నంబర్లకే పరిమితమా? హీరోయిన్‌గా సక్సెస్‌ని దక్కించుకోలేదా? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎంతగా ప్రయత్నించినా తనకు కమర్షియల్ విజయం లభించకపోవడంతో కేతిక కూడా కొంత నిరుత్సాహానికి గురైంది. అయితే తాజాగా శ్రీవిష్ణుతో కలిసి చేసిన సింగిల్ రీసెంట్‌గా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. హీట్ సమ్మర్‌లో కూల్‌హిట్‌గా నిలిచి శ్రీవిష్ణుతో పాటు కేతికకు, లవ్ టుడే ఫేమ్ ఇవానకు మంచి విజయాన్ని అందించింది. చాలా రోజుల తరువాత కేతిక శర్మకు సింగిల్ తో సక్సెస్ లభించింది. దీంతో హాట్ లేడీగా పేరు తెచ్చుకున్న కేతిక ఇక



ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా? అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న సింగిల్ వసూళ్ల పరంగానూ మంచి ఫిగర్లని నమోదు చేస్తుండటంతో ఇక కేతిక కెరీర్ టర్న్ అయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ మూవీ తరువాత కేతిక తమిళ డైరెక్టర్ రాజేష్ ఎం.సెల్వ డైరెక్షన్‌లో ఓ మూవీ చేస్తోంది. ఇది కూడా హిట్ అనిపించుకుంటే తెలుగులో కేతికకు ఇక తిరుగుండదన్నమాటే.

# 200 కోట్ల బడ్జెట్ తో దేవరకొండ సినిమా!


ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం మైత్రీ మూవీ మేకర్స్ 200 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు నిర్మాణ వర్గాల నుంచి తెలిసింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ‘కింగ్ డమ్’ రిలీజ్ అనంతరం విజయ్ ఈ సినిమానే పట్టాలెక్కిం చనున్నాడు. బ్రిటీష్ కాలం నేపథ్యంలో సాగే స్టోరీ ఇది. 1854-1878 మధ్య జరిగిన చారిత్రాత్మక సంఘట నలు ఆధారంగా రూపొందిస్తున్నారు. భారీ కాన్వాస్ పై పిరియాడిక్ చిత్రంగా రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్నాళ్లుగా రాహుల్ ఇదే పనిలో ఉన్నాడు. ఇప్పటికే విజయ్ ద్యాన ముద్రలో ఉన్న పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. పోస్టర్ తోనే ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అయింది. పాన్ ఇండియా స్థాయిలో ఇప్పటి వరకూ ఎవరూ తెరకెక్కించని పాయింట్ ని తీసుకుని తెరకెక్కిస్తున్నారు? అన్నది అర్ధమైంది. బలమైన కథ, క థనాలతో రూపొందుతున్న చిత్రంగా అప్పుడే



ప్రచారం పీక్స్ కి చేరింది. మరి ఈ పాన్ ఇండియా సినిమా బడ్జెట్ ఎంత అన్నది ఇంతవరకూ ఎక్కడా బయటకు రాలేదు. కథని బట్టి బట్టి బడ్జెట్ కూడా భారీగా ఉంటుందని ఓ అంచనా తెరపైకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం మైత్రీ మూవీ మేకర్స్ 200 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు నిర్మాణ వర్గాల నుంచి తెలిసింది. సినిమాలో సెట్స్ కోసమే 70 కోట్లకు పైగా ఖర్చు అవుతుందట.




# బికినీ బ్యూటీ సోనాల్ పర్ఫెక్ట్ టోన్డ్ లుక్



బాలయ్య-బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. బాలయ్య-బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది. అయితే సక్సెస్ ఉన్నా ఈ భామకు ఏదీ కలిసి రాలేదు. ప్రభాస్ ఆదిపురుష్ చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ బంగ్లాదేశ్ కి చెందిన ప్రముఖ పంపిణీదారుడు నిర్మిస్తున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో ఛాన్స్ కల్పించాడు. థర్డ్ పేరుతో ఈ మూవీ డాలీవుడ్ (బంగ్లాదేశ్) లో విడుదల కావాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన సరైన అప్ డేట్ లేదు. సౌత్ లో అన్ని పరిశ్రమలతో సంబంధాలు ఉన్నా, హిందీ పరిశ్రమను సోనాల్ ఎప్పటికీ వదిలిపెట్టదు. తాజాగా సోనాల్ చౌహాన్ షేర్ చేసిన ఫోటోషూట్ ఒకటి అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. సోనాల్ మతిచెడే బికినీ ఫోటోషూట్ లో టోన్డ్ లుక్ తో ఆకట్టుకుంది. తన కళ్లకు అందమైన బ్లాక్ రేబాన్ ని ధరించి మోడ్రన్ టచ్ ఇచ్చింది. బికినీపై మెస్సీ స్లిప్ ఆన్ డ్రెస్ ధరించిన చౌహాన్ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. సోనాల్ స్పెషల్ ఫోటోషూట్ వేగంగా యూత్ లోకి దూసుకెళుతోంది. వరుస ఫోటోషూట్లతో గ్యాప్ లెస్ గా సోనాల్ ప్రయత్నం చూసి, తిరిగి టాలీవుడ్ అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com